సాక్షి
రాజన్న సిరిసిల్ల
శుక్రవారం । 24 । మార్చి । 2023

సక్రమమార్గంలో నడుచుకుంటూ, దేవు నియందు భక్తి విశ్వాసం కలవారికి వారి కర్మానుసారం మంచి జీవితం లభిస్తుంది. – మహమ్మద్ ప్రవక్త

ఇఫ్తార్	సహర్
శుక్ర 6:32	శని 4:51

రంజాన్ వేళలు

..మీరే సాక్షి

- 15 ఏళ్లుగా 'సాక్షి' అలుపెరగని పోరాటం
- అనేక సమస్యలకు పరిష్కారం
- మరెన్నో వెలుగులోకి తెచ్చిన వైనం
- నేడు 16వ వసంతంలోకి అడుగు



తెలుగు నేలపై చెరగని సంతకం 'సాక్షి'. పాఠకులను గుండెలకు హత్తుకుంటూ.. శుభోదయం చెబుతూ.. తన పయనం సాగిస్తోంది. వార్తలు.. వాస్తవాల ఆవిష్కరణలతోనే సామాజిక బాధ్యతలను భుజాన వేసుకుంది. 'సాక్షి' అక్షర సేద్యం మొదలై నేటితో పదిహేనేళ్లు పూర్తి. నిజాలను నిక్కచ్చిగా చెప్పడంలోనూ.. అభాగ్యులకు అండగా నిలవడంలోనూ ముందుంది. బాధితులకు అండగా నిలిచి బతుకుపై భరోసా కల్పించడంలోనూ నేనున్నానంటూ తోడుగా నిలబడింది. అవినీతి.. అక్రమాలపై అక్షర సమరం చేసింది. కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతున్న వారి దీనగాథలను ఆపన్నుల దృష్టికి తీసుకెళ్లి సాయం అందించడంలో తన చేయి నందించింది. ప్రజల ఇబ్బందులపై అక్షరాలను ఆయుధాలుగా మలుచుకుని నిత్యం కథనాలు అందిస్తున్న 'సాక్షి'తో అనేక సమస్యలు పరిష్కారమయ్యాయి. అధికారుల స్పందనతో మరెన్నో ఇక్కట్లు తొలగాయి. సాక్షి పుట్టుక నుంచి వివిధ సమస్యలపై సాగించిన అక్షరపోరాటంలోని కొన్ని కథనాలు.. ప్రజలకు దూరమైన సమస్యలను ఒకసారి పరిశీలిస్తే..!!

న్యూస్‌రీల్

ఉత్తీర్ణత శాతంపై శ్రద్ధ పెట్టాలి



విద్యార్థులకు పలు సూచనలు చేస్తున్న డీఈవో రమేశ్‌కుమార్

తంగళ్లపల్లి(సిరిసిల్ల): ఉపాధ్యాయులు పదోతరగతి ఉత్తీర్ణతశాతంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఈవో రమేశ్‌కుమార్ కోరారు. తంగళ్లపల్లి మండలం నేరెళ్ల గురుకుల పాఠశాల, కళాశాలను గురువారం సందర్శించారు. డీఈవో మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపి, రాష్ట్రస్థాయిలో రాజన్నసిరిసిల్ల జిల్లాను అత్యుత్తమ ఫలితాలతో ముందు వరుసలో నిలపాలన్నారు. 100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులకు తగిన సలహాలు, సూచనలు ఇచ్చారు. అనంతరం డైనింగ్‌హాల్‌లో భోజనాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్ రాధ ఉన్నారు.

గోదావరి జలాలకు పూజలు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన గ్రామచెరువులోకి గోదావరి జలాలు వచ్చి మత్తడి దూకింది. దీంతో గ్రామస్తులు అక్కడికి చేరుకొని గోదావరి జలాలకు ప్రత్యేక పూజలు చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు చెన్నమనేని వెంకట్రావు, సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్, సింగిల్‌విండో మాజీ చైర్మన్ విజయేందర్‌రెడ్డి, అబ్బాడి అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

సదెరంలో 45 మందికి పరీక్షలు

సిరిసిల్ల: సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ఆస్పత్రిలో గురువారం సదెరం శిబిరం నిర్వహించారు. ఎముకలకు(ఆర్థోపెడిక్) సంబంధించిన దివ్యాంగులు 45 మంది వైకల్య పరీక్షలకు హాజరయ్యారు. ఆస్పత్రి పర్యవేక్షకులు మురళీధర్‌రావు, ఆర్‌ఎంవో రఘు, ఆర్థోపెడిక్ అనిల్‌కుమార్, డీఆర్‌డీఏ ఏపీవో పాపారావు, టైపిస్ట్ వేణు ఉన్నారు.

గోశాలలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న దేవస్థానం గోశాలలోని కోడెలను జనగామ, మహబూబాబాద్ జిల్లాల్లోని గోశాలలకు గురువారం అందజేశారు. జనగామ జిల్లా లింగాలఘన్‌పూర్ మండలం నెల్లుట్ల గ్రామానికి చెందిన బహుజన గోశాలకు 20, మహబూబాబాద్ జిల్లా మేచరాజ్‌పల్లికి చెందిన మహాలక్ష్మి గోశాలకు 20 కోడెలను అందజేశారు. ఆలయ అధికారులు శ్రీనివాస్, శంకర్ తదితరులు ఉన్నారు.

గ్రూప్-4కు ఉచిత శిక్షణ

సిరిసిల్లకల్చరల్: గ్రూప్–4 పరీక్షకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి తెలిపారు. రూ.5లక్షలకు లోబడి వార్షికాదాయం ఉండి, ఏదేని డిగ్రీలో ప్రథమ శ్రేణి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులుగా పేర్కొన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత ఏప్రిల్ 2వ తేదీలోపు సంబంధిత సర్టిఫికెట్ల జిరాక్స్ ప్రతులతో ప్రగతినగర్‌లోని కార్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు.

ఫ్లోరైడ్ రక్కసిపై పోరు



గొల్లపల్లి(ధర్మపురి): గొల్లపల్లి మండల కేంద్రానికి కిలోమీటర్ దూరం కూడా లేని ఊరు గుంజపడుగు. ఈ గ్రామస్తులు కొన్నేళ్లుగా ఫ్లోరైడ్ నీటితో ఇబ్బందిపడుతున్నారు. ఆ నీటిని తాగి జీవశ్ఛవాలుగా, వికలాంగులుగా, కిడ్నీ, కీళ్ల నొప్పుల బారిన పడి అల్లాడుతున్నారు. వారి బాధలు కళ్లకు కట్టేలా 'సాక్షి'లో 'కబలిస్తున్న ఫ్లోరైడ్ రక్కసి' శీర్షికన కథనం ప్రచురితమైంది. అయినా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించలేదు. కానీ.. ఓ వైద్యుడు చలించిపోయాడు. జగిత్యాలకు చెందిన వైద్యుడు ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి గ్రామస్తుల బాధలు నేరుగా చూసి ఫ్లోరైడ్ రహిత నీటిని అందిస్తానని హామీ ఇచ్చాడు. ఓ స్వచ్ఛంద సేవ సంస్థతో కలిసి తనవంతు ఆర్థికసాయం అందజేశాడు. మూడునెలల్లో పనులు పూర్తి చేయించి వాటర్ ప్లాంట్ ప్రారంభించారు.

'సాక్షి'కి ధన్యవాదాలు



మా గ్రామంలో ఉన్న సమస్యలను 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. ప్రధానంగా ఫ్లోరైడ్ సమస్యపై కథనం రాయగా ఎల్లాల శ్రీనివాస్‌రెడ్డి సారు స్పందించి వాటర్ ప్లాంట్‌కు ఆర్థికసాయం చేశారు. ఇప్పుడు ఆ నీళ్లే తాగుతున్నాం. మా గ్రామస్తుల తరఫున 'సాక్షి'కి ధన్యవాదాలు.

– అంజి, గుంజపడుగు

ప్రాణం పోసిన 'సాక్షి'



వీణవంక: తెలంగాణ ఉద్యమ సమయంలో ధూంధాం కళాకారులతో కలిసి ఆటపాటలతో ఉర్రూతలూగించిన వీణవంక మండలం మల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోనెల రమేశ్‌కు మెదడులో రక్తస్రావం జరిగింది. ఆపరేషన్‌కు రూ.13 లక్షలు అవసరం అయ్యాయి. కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడింది. అప్పు పుట్టే పరిస్థితి లేదు. ఆపరేషన్ చేయించే స్థోమత లేదు. ఈ క్రమంలో ఆయన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు 'సాక్షి'ని ఆశ్రయించారు. 2019 సెప్టెంబర్ 21న సాక్షిలో 'పేద కళాకారుడికి పుట్టెడు కష్టం' శీర్షికతో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దేశవిదేశాల నుంచి దాతలు స్పందించారు. రూ.10 లక్షలకు పైగా సమకూరాయి. ఆపరేషన్ చేసుకున్న రమేశ్ ఇప్పుడు కుటుంబంతో జీవిస్తున్నాడు.

బతుకుత అనుకోలే..



ధూంధాం కళాబృందంలో పోతురాజు వేషం వేసేవాడిని. హఠాత్తుగా మెదడులో రక్తస్రావమై పక్షవాతం వచ్చింది. ఆస్పత్రిలో చేరితే రూ.13లక్షలు అవుతాయని వైద్యులు చెప్పారు. నా భార్య రజిత దిక్కుతోచని స్థితిలో పడింది. ఇక బతుకన అనుకున్న. ఇంతలో మా ఊరోళ్లు 'సాక్షి'ని సంప్రదించుమని చెప్పారు. నా గురించి 'సాక్షి'లో రాశారు. రూ.10 లక్షలకు పైగా దాతలనుంచి సాయం వచ్చింది. ఆపరేషన్ అయ్యింది. 'సాక్షి' నాకు ప్రాణం పోసింది. లేకుంటే బతికెటోన్ని కాదు.

– గోనెల రమేశ్, మల్లారెడ్డిపల్లి

'సాక్షి' కథనంతో చిన్నారులు భద్రం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఈ ఏడాది ఫిబ్రవరిలో కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఇంటి ఎదుట ఆడుకుంటున్న ఇద్దరు చిన్నారులు కాదాసి అక్షిత (11), మిడిదొడ్డి లోకేశ్ (09)ను అదే కాలనీలో నివసించే మహిళ చాక్లెట్ల ఆశచూపి కిడ్నాప్ చేసింది. చిన్నారులను కరీంనగర్ రైల్వే స్టేషన్ నుంచి ఔరంగాబాద్‌కు తీసుకెళ్లింది. రైలులో పిల్లలు ఏడుస్తున్నారని రక్తం వచ్చేలా చితకబాదింది. ఔరంగాబాద్ చేరుకోగానే పిల్లల గాయాలు చూసిన పోలీసులు ముగ్గురిని అదుపులోకి తీసుకుని కరీంనగర్‌లోని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. చిన్నారుల తల్లిదండ్రుల ఇద్దరు నిరక్షరాస్యులు కావడంతో భాష సమస్య తలెత్తింది. వెంటనే రంగంలోకి దిగిన 'సాక్షి' అధికారులు, తల్లిదండ్రుల మధ్య సంధానకర్తగా వ్యవహరించింది. పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించే న్యాయ ప్రక్రియలో రెండురోజుల పాటు దుబాసీగా వ్యవహరించింది. ఫలితంగా అక్కడి అధికారులు పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించారు. ఆ తరువాత చిన్నారులు క్షేమంగా కరీంనగర్‌కు చేరుకున్నారు. ఓ వైపు చిన్నారుల తల్లిదండ్రులకు సహాయపడుతూనే మరోవైపు ఈ కిడ్నాప్ ఉదాంతం వరుస కథనాల ప్రచురించింది. దీంతో స్పందించిన పోలీసులు మహిళపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు.

'సాక్షి' కన్నపేగును కాపాడింది



మా పిల్లలను పొరుగింటి మహిళ కిడ్నాప్ చేసిందని వెంటనే గుండె ఆగినంత పనైంది. అభం శుభం తెలియని చిన్నారులు మహారాష్ట్ర రైల్వే పోలీసులకు చిక్కారని తెలియగానే కంగారు పడ్డాం. కానీ 'సాక్షి ప్రతినిధి' మాకు మహారాష్ట్ర చిల్డ్రన్ ప్రొటెక్షన్ అధికారులకు మధ్యగా సంధానకర్తగా వ్యవహరించి పిల్లలను క్షేమంగా విడిపించారు. 'సాక్షి' కథనాలతో పోలీసులు కిడ్నాప్‌నకు పాల్పడిన మహిళపై కేసు పెట్టారు. సాక్షి చొరవే మా కన్నపేగును కాపాడింది.

– సరిత, చిన్నారి తల్లి

ఇటుకబట్టీల్లో అక్షరవెలుగు



సాక్షి, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా అంటే ఇటుక బట్టీలకు కేరాఫ్. ఆయా ఇటుక బట్టీల్లో పనిచేసే వలస కార్మికుల పిల్లల చదువులపై 'బట్టీల్లో మొక్కుబడి'..?' శీర్షికన వారి సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో అప్పటి డీసీపీ రూపేష్ స్పందించి 'ఆపరేషన్ ధృవ' పేరుతో ఇటుకబట్టీల్లో డిజిటల్ పాఠశాలలు ఏర్పాటు చేశారు. అలాగే ప్రతి ఇటుక బట్టీల్లో వారి ప్రాంతానికి చెందిన టీచర్లతో విద్యాబోధన జరిగేలా చర్యలు తీసుకున్నారు.

మా పిల్లలు చదువుకుంటున్నారు



ఉపాధికోసం ఒడిశా నుంచి వలస వచ్చి భార్యపిల్లలతో సుల్తానాబాద్ ఇటుకబట్టీలో పనిచేస్తున్నాం. పిల్లల చదువు గురించి పెద్దగా పట్టించుకోలేదు. 'సాక్షి' పేపర్‌లో మా వలస కార్మికుల పిల్లల చదువులపై రాసిండ్రు అని అప్పటి డీసీపీ సారు బట్టీల్లో స్కూళ్లు ఏర్పాటు చేయించిండు. ఇప్పుడు మా పిల్లలతో పాటు మిగితా పిల్లలు పనిలోకి రాకుండా బడికిపోయి చదువుకుంటున్నారు.

– తులసీరాంనాగ్, వలస కార్మికుడు

మంథని సమస్య.. జిల్లావ్యాప్తంగా పరిష్కారం



మంథని: పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలతో అన్నదాతలు ఇబ్బంది పడ్డారు.ఈ స్తంభాల పరిస్థితిపై 2010 జూన్, జూలై మాసాల్లో 'సాక్షి' వరుస కథనాలిచ్చింది. ఎన్‌పీడీసీఎల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లింది.అప్పటి మంథని డీఈఈ ఈశ్వరప్రసాద్ ఉన్నతాధికారులకు నివేదించారు. ఒరిగిన స్తంభాలను సరిచేసే కార్యక్రమానికి 2013మార్చి 22న శ్రీకారం చుట్టారు. పనులను ఎస్ఈ రాంమోహన్‌రావు పరిశీలించి సమస్య ఉన్నచోట జిల్లాలోని అన్ని ప్రాంతాలకు విస్తరించారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నూతనంగా 47 వేల స్తంభాలు అమర్చారు.

మెప్మా కుంభకోణంపై చర్యలు

కరీంనగర్ సిటీ: కరీంనగర్ నగర పాలక సంస్థ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)లో నకిలీ సంఘాలను సృష్టించి కోట్లాది రూపాయలు రుణాలు తీసుకుని సొంతఖాతాలోకి మళ్లించుకున్న వైనంపై సాక్షిలో వరుస కథనాలు ప్రచురించాం. దీనిపై స్పందించిన అధికారులు విచారణకు ఆదేశించారు. వీటితో పాటు నకిలీ సంఘాల పేరుతో రుణాలు తీసుకున్న వారిపై పోలీస్‌స్టేషన్ కేసు నమోదు చేశారు. ఈ కుంభకోణంలో పాలు పంచుకున్న వారిని మెప్మా నుంచి తొలగించారు.

దళితులపై పోలీసుల థర్డ్ డిగ్రీ

సిరిసిల్ల: తంగళ్లపల్లి మండలం నేరెళ్ల దళితులపై పోలీసులు 2017 జూలై 14న థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. ఈ ఘటనపై 'సాక్షి' 'దళితులపై థర్డ్ డిగ్రీ' అనే కథనాన్ని ప్రచురించింది. జిల్లెల్ల వద్ద జూలై 2న ఇసుక లారీ ఢీకొని బదనపురం భూమయ్య మరణించాడు. గతంలో ఇలాంటి ఘటనలు జరగడంతో ఆగ్రహించిన స్థానికులు ఐదు ఇసుక లారీలకు నిప్పు పెట్టారు. ఈ ఘటనలో 13 మందిపై కేసు పెట్టిన పోలీసులు పెంట బానయ్య, కోల హరీశ్, చెప్యాల బాలరాజు, పసుల ఈశ్వర్, గంధం గోపాల్, బత్తుల మహేశ్‌ను నిర్బంధించిన థర్డ్ డిగ్రీ ప్రయోగించారు. దీనిపై 'సాక్షి'లో కథనం రావడంతో పార్లమెంట్ స్పీకర్ మీరాకుమార్, జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ నేరెళ్లకు వచ్చి బాధితులను పరామర్శించారు. అన్ని రాజకీయ పార్టీల నేతలు నేరెళ్లకు వచ్చారు. టాస్క్‌ఫోర్స్ ఎస్సై రవీందర్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఎస్పీ విశ్వజిత్ కంపాటిని బదిలీ చేశారు.

బొమ్మలమ్మగుట్టకు తప్పిన గ్రానైట్ గండం

గంగాధర: శతాబ్దాల చరిత్రకు సాక్ష్యంగా నిలుస్తున్న గంగాధర మండలంలోని కురిక్యాల, కొండన్నపల్లి గ్రామశివారులోని బొమ్మలమ్మగుట్టపై 13ఏళ్ల క్రితం గ్రానైట్ వ్యాపారులు కన్ను వేశారు. దాదాపు 9 మంది వ్యాపారులు గ్రానైట్ రాయి తీసుకెళ్లడానికి దరఖాస్తు చేసుకున్నారు. మామూళ్లకు అలవాటు పడ్డ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా గ్రానైట్‌క్వారీల ఏర్పాటుకు అనుమతి ఇచ్చేందుకు సిద్ధం అయ్యారు. ఈ విషయమై గ్రానైట్ తీయవద్దని కురిక్యాల, కొండన్నపల్లి యువకులు బొమ్మలమ్మగుట్ట చరిత్రను వివరిస్తూ పురావస్తు, పర్యాటక, మైనింగ్‌శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. వినూత్న నిరసనలకు కర్ణాటక ప్రభుత్వం సైతం మద్దతిచ్చింది. అప్పుడే పురుడు పోసుకున్న 'సాక్షి' దినపత్రిక గుట్ట చరిత్రపై వరుస కథనాలు ప్రచురించింది. ప్రభుత్వం సైతం పర్యాటకప్రాంతంగా గుర్తించింది. ఇందుకు సంబంధించిన జీవో నంబరు 13/2011 విడుదల చేసింది.

'సాక్షి'కి సలాం



బొమ్మలమ్మగుట్ట గ్రానైట్ వ్యాపారుల పరం కాకుండా ఉండటానికి 'సాక్షి' వరుస కథనాలు ఇచ్చింది. అవే మా ఉద్యమానికి ఊపిరయ్యాయి. ఎట్టకేలకు స్పందించిన ప్రభుత్వం గ్రానైట్ వ్యాపారుల దరఖాస్తును రద్దు చేసింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని చాలాబాగా అభివృద్ధి చేస్తున్నారు.

– లింగయ్య, బొమ్మలమ్మగుట్ట పరిరక్షణ, అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు

బొగ్గుదందాకు చెక్

సాక్షి, పెద్దపల్లి: గోదావరిఖనిలో సింగరేణి నుంచి అక్రమంగా బొగ్గు రవాణాపై '100 కోట్ల బొగ్గుదందా' శీర్షికన 2016లో మొదటిసారిగా వెలుగులోకి తీసుకొచ్చింది.దందా సాగుతున్న వైనం, అందులో ఉన్న దళారులపై వరుస కథనాలు ప్రచురించింది. అప్పటి ఎస్పీ వారియర్ స్పందించి బొగ్గుదందాపై ఉక్కుపాదం మోపి సింగరేణికి నష్టం వాటిల్లకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. అప్పటి నుంచి దందాకు చెక్ పడింది.

'సాక్షి' ఫొటో కుటుంబాన్ని కలిపింది



కొడుకు, కోడలు, మనుమడితో ఎల్లయ్య

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం గూడూరుకు చెందిన మినప ఎల్లయ్య 2006లో దుబాయ్ వెళ్లేందుకు రూ.50వేలు అప్పు చేసి ఏజెంట్ చేతిలో పెట్టి మోసపోయాడు. స్వగ్రామానికి రావడం ఇష్టం లేక వెంకటాపూర్‌లోని కూతురు వద్దకు వెళ్లాడు. ఒకరోజు కనిపించకుండా పోయాడు. భార్య కేశవ్వ, కుమారులు దేవరాజు, శ్రీనివాస్ బంధువుల ఇళ్లు, తెలిసిన చోట ఏడాదిపాటు వెతికినా.. ఆచూకీ లభించలేదు. 2009 మార్చిలో నిజామాబాద్ జిల్లా వర్ని నుంచి వ్యవసాయ కూలీలకు సంబంధించిన కథనం 'సాక్షి'లో ప్రచురితమైంది. సాక్షిలో వచ్చిన ఫొటోను గూడూరు సర్పంచ్ చీటి వెంకటనర్సింగారావు చూశారు. ఆయనను ఎల్లయ్యగా గుర్తించి ఆయనకు వైద్యం చేయించి స్వగ్రామానికి తీసుకొచ్చారు. 'సాక్షి' దినపత్రికలో కథనంతో ఇంటి పెద్దదిక్కును కుటుంబ సభ్యుల చెంతకు చేర్చింది. తమ కుటుంబం పెద్దను తమ వద్దకు చేర్చిన సాక్షికి జీవితాంతం రుణపడి ఉంటామని ఎల్లయ్య భార్య కేశవ్వ, కుమారులు దేవరాజు, శ్రీనివాస్ పేర్కొన్నారు.

క్రీడారంగానికి దిక్సూచి

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ క్రీడారంగానికి 'సాక్షి' దిక్సూచిగా మారింది. 15 ఏళ్లుగా క్రీడారంగంలో ప్రారంభం కాని ఎన్నో కార్యక్రమాలకు 'సాక్షి' కథనాలు ముందడుగు వేశాయి. 2005లో అంబేడ్కర్ స్టేడియంలో తాత్కాలికంగా ప్రారంభించిన ప్రాంతీయ క్రీడాపాఠశాలను 2019లో లోయర్ మానేరు కిందకు సొంత భవనాల్లోకి మారడంలో 'సాక్షి' కథనాలే ప్రధాన కారణం.2020లో కరీంనగర్‌కు మంజూరైన సెట్విన్ సెంటర్‌ను రెండేళ్లకు 'సాక్షి' కథనంతో ప్రారంభించారు. దీంతో వేలాది మంది యువతకు శిక్షణ కల్పించినట్లయ్యింది.

ధైర్యం కోల్పోకండి.. ఆదుకుంటాం!

- జిల్లా రైతులకు సీఎం కేసీఆర్ భరోసా
- అండగా ఉండాలని వేడుకున్న రామడుగు రైతులు
- ప్రతీ ఎకరాకు రూ.10వేలు ఇస్తామని సీఎం ప్రకటన
- జిల్లాలో దాదాపు 23వేల ఎకరాలకు.. రూ.23 కోట్ల పరిహారం

సాక్షి ప్రతినిధి, కరీంనగర్/రామడుగు: అకాల వర్షాల వల్ల పంటలు కోల్పోయిన రైతులెవరూ అధైర్యపడవద్దని సీఎం కేసీఆర్ అన్నారు. వరంగల్ నుంచి నేరుగా రామడుగు లక్ష్మీ పంప్‌హౌజ్ సమీపంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ వద్ద సీఎం దిగారు. అక్కడ నుంచి లక్ష్మీపూర్, రామచంద్రపూర్‌లో పర్యటించారు. లక్ష్మీపూర్‌లో రైతు దేవా రామచంద్రారెడ్డి వేసిన మస్క్ మిలాన్, డ్రాగన్‌ఫ్రూట్ పంట నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతు ముఖ్యమంత్రితో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో తమ ప్రాంతంలో తీవ్ర కరువు, కాటకాలు ఉండేవని, ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడేటివి కాదని గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు పుష్కలమైన నీటి సదుపాయాలు సమకూరడంతో భూగర్భ జలాలు దండిగా పెరిగాయన్నారు. కేవలం 8 నుంచి 10 మీటర్ల లోతులో నీరు వస్తుందన్నారు. కరెంటు, నీరు విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదని చెప్పారు. ఈసారి పంట నష్టంపోయి తనకు దాదాపు నష్టం వచ్చినా.. తానేం అధైర్యపడడం లేదని అన్నారు. 'సీఎం సార్ మీరే మా ధైర్యం దయచేసి మమ్మల్ని ఆదుకోండి సార్' అని రైతు వేడుకున్నాడు. అనంతరం సీఎం సమీపంలోని మామిడి రైతు ఎడవెల్లి రాజిరెడ్డి తోటకు వెళ్లారు. రాలిపోయిన మామిడి నష్టంపై ఆరా తీశారు. అనంతరం రైతువేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

ఎడారి, వలసల ప్రాంతం

సమైక్యపాలనలో రాష్ట్రంలో ఎక్కడ చూసినా కరువు కాటకాలు ఉన్నాయని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. చొప్పదండి ప్రాంతం కూడా ఎడారిలా ఉండేదని, రైతులంతా బతుకుదెరువుకోసం వలసలు వెళ్లేవారని గుర్తుచేశారు. అందుకే, కాళేశ్వరం ప్రాజెక్టు కట్టుకుని, కాలువలు నిర్మించుకుని ఆ ప్రాంతాన్ని పచ్చగా చేసుకున్నామన్నారు. తాను వస్తుంటే లక్ష్మీ పంప్ హౌజ్ కాలువలకు రైతులు పెట్టుకున్న మోటార్ల పంపులు చూసి సంతోషించామన్నారు. వీటి ద్వారా కాలువకు ఎగువ నేలల్లో ఉన్న పంటలకు సైతం నీరందుతోందని హర్షం వ్యక్తం చేశారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని అందుకే, నష్టపోయిన ప్రతీ రైతును ఆదుకుంటామన్నారు. ఎకరాకు రూ.10వేల చొప్పున పంట సాయం ప్రకటించారు. కాగా జిల్లాలో దాదాపు 23వేల ఎకరాల్లో పంట నష్టం జరగగా.. రూ.23 కోట్ల మేరకు నష్టపరిహారం అందనుంది. కాగా.. వడగండ్ల వర్షంతో లక్షలాది రుపాయల పంటలు నష్టపోతే సీఎం కేసీఆర్ ఎకరాకు రూ.పదివేలు పరిహారం అందజేస్తామని ప్రకటించడంపై అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మంత్రులు గంగుల కమలాకర్, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుంకె రవిశంకర్, దాసరి మనోహర్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమార్, సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్, కలెక్టర్ కర్ణన్, సీపీ సుబ్బారాయుడు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ చైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



దెబ్బతిన్న వరిపంటను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్, చిత్రంలో మంత్రులు, అధికారులు

పోలీసులపై మంత్రి అసహనం..

సీఎం పర్యటన సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ పోలీసులపై అసహనం ప్రదర్శించారు. సీఎం పర్యటనకు ముందుగానే మధ్యాహ్నం మంత్రి గంగుల కాన్వాయ్ రామడుగు చేరుకుంది. అయితే, గంగుల కాన్వాయ్‌కు దారి చూపేందుకు పైలెట్ వాహనం రాలేదు. ఈ విషయం పోలీసులకు తెలిపినా.. వారు వాహనం సమకూర్చలేకపోయా రు. పంప్‌హౌజ్ గెస్ట్ హౌజ్ చేరుకున్నాక.. మంత్రి రామడుగు పోలీసులపైన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- సఖి సెంటర్ ఇన్‌చార్జి రోజా



అవగాహన కల్పిస్తున్న రోజా

కోనరావుపేట (వేములవాడ): బాలికలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని 'సఖి' సెంటర్ సిరిసిల్ల నిర్వాహకురాలు రోజా అన్నారు. మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలు ఎలాంటి సమస్యను ఎదుర్కొన్నా '181' నెంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఫోక్సో, సైబర్ నేరాలు, బాలికా సంరక్షణ చట్టాలపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సాగర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగలక్ష్మి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి



విద్యార్థుల గ్రేడ్లను పరిశీలిస్తున్న పెరుమాండ్ల శ్రీనివాస్

చందుర్తి (వేములవాడ): విద్యార్థుల్లో భాష, గణిత సామర్థ్యాలను పెంపొందించాలని తొలిమెట్టు రాష్ట్ర పరిశీలకుడు పెరుమాండ్ల శ్రీనివాస్ కోరారు. గురువారం మండలంలోని ప్రాథమిక పాఠశాలను తొలిమెట్టు రాష్ట్ర పరిశీలకుల బృందం తనిఖీ చేసింది. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరుపట్టికలను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విక్కుర్తి లక్ష్మీ నారాయణ, రొండి చంద్రకళ, ఉపాధ్యాయులు నరేశ్, ముఖేశ్, రవి,మమత, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల పీహెచ్‌సీకి ఎన్-క్వాస్ సర్టిఫికెట్

- అభినందించిన కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని పుచ్చలపల్లి సుందరయ్యనగర్ పీహెచ్‌సీకి నేషనల్ క్వాలిటీ అష్యూరెన్స్ స్టాండర్డ్ సర్టిఫికెట్ వరించింది. ఈమేరకు గురువారం ఎన్-క్వాస్ నుంచి సర్టిఫికెట్ అందింది. ఈసందర్భంగా కలెక్టర్ అనురాగ్ జయంతి మాట్లాడుతూ గతంలో వేములవాడ, తంగళ్లపల్లి, కోనరావుపేట మండలాల్లోని పీహెచ్‌సీలకు ఎన్-క్వాస్ సర్టిఫికెట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. సిరిసిల్ల బీవైనగర్ అర్బన్‌హెల్త్ సెంటర్‌కు కూడా ఎన్-క్వాస్ గుర్తింపు రావడంపై జిల్లా వైద్యశాఖ, యూహెచ్‌సీ సిబ్బందిని అభినందించారు. మంత్రి కేటీఆర్ చొరవతో జిల్లాలో పేదలకు సర్కారు వైద్యం నాణ్యతా ప్రమాణాలతో అందుతుందన్నారు. అన్ని ప్రభుత్వాసుపత్రులలోల మౌలిక వసతులు పెరిగాయని, ఆధునిక వైద్య పరికరాల అందుబాటులో ఉండటంతో ఓపీ, ఐపీ, సర్జికల్ విభాగాల్లో రోగుల తాకిడి పెరిగిందన్నారు.

ఆన్‌లైన్‌లో టెన్త్ హాల్‌టికెట్స్

- డీఈఓ రమేశ్

సిరిసిల్లఎడ్యుకేషన్: జిల్లాలో పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థుల హాల్‌టికెట్స్ శుక్రవారం నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంటాయని డీఈవో రమేశ్ గురువారం ప్రకటనలో తెలిపారు. పదోతరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి ప్రారంభమవుతాయని విద్యార్థులు వారి కేంద్రాలను ఆన్‌లైన్ నుంచి తీసుకున్న హాల్‌టికెట్స్‌తో పరీక్షకు హాజరుకావాలని తెలిపారు.

గుడుంబా అమ్మితే రూ.లక్ష ఫైన్

- ఏడాదిలో 512 మంది బైండోవర్
- 43 మంది నుంచి రూ.39లక్షలు వసూలు
- 29 మందిపై కేసులు.. ముగ్గురికి జైలు
- గుడుంబా కట్టడికి సర్కార్ వ్యూహం
- అయినా ఆగని తయారీ, విక్రయాలు



బెల్లం పానకం ధ్వంసం చేస్తున్న అధికారులు (ఫైల్)



జరిమానా చెల్లిస్తున్న నిందితురాలు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): పల్లెలను గుడుంబా రహితంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోంది. నాటుసారా తయారీ, విక్రయాలపై కఠిన ఆంక్షలు అమలు చేస్తోంది. ప్రభుత్వ నిర్ణయంతో ఎక్సైజ్ అధికారులు పల్లెల్లో గుడుంబా తయారీదారులపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. గుడుంబా విక్రయిస్తూ ఒక్కసారి బైండోవర్ అయిన వ్యక్తి తిరిగి సారా అమ్ముతూ పట్టుబడితే రూ.లక్ష జరిమానా చెల్లించేలా నియమాలు రూపొందించారు. జరిమానా చెల్లించకుంటే జైలుశిక్ష అనుభవించాల్సిందే. జిల్లాలో ఏడాదిలో 512 మందిని బైండోవర్ చేశారు.

రూ.39 లక్షలు వసూలు

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని 255 గ్రామపంచాయతీలలో సుమారు 127 పంచాయతీల పరిధిలో గుడుంబా విక్రయాలు సాగుతున్నట్లు అధికారులు గుర్తించారు. సారా విక్రయాలు ఎక్కువగా ఉన్న తండాలు, పల్లెలపై నిఘా పెట్టారు. ఏడాదిలో ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్ పరిధిలోని వీర్నపల్లి, గంభీరావుపేట, ముస్తాబాద్, కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలాల్లో గుడుంబా స్థావరాలపై దాడులు చేసి వివిధ కేసుల్లో 512 మందిని ఆయా మండలాల్లోని తహసీల్దార్ల ఎదుట బైండోవర్లు చేశారు. గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డ 29 మందిపై కేసులు నమోదు చేశారు. 512 మందిలో తిరిగి నేరాలకు పాల్పడ్డ 43 మందిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించగా, 40 మంది రూ.39 లక్షల జరిమానాలు చెల్లించారు. మిగతా ముగ్గురు ప్రస్తుతం జైలు శిక్ష అనుభవిస్తున్నారు.

మళ్లీ అమ్మితే జైలుకే..

గుడుంబా తయారీ, అమ్మకాల్లో పట్టుబడిన వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు తహసీల్దార్ల ముందు మొదటి హెచ్చరికగా పలు షరతులతో బైండోవర్ చేస్తున్నారు. ఏడాదిలో వారు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఒప్పంద పత్రాలు పలు షరతులతో తీసుకొని వదిలేస్తారు. అయితే బైండోవర్లు చేసిన వారి కదలికలపై అధికారులు నిఘా ఉంచుతారు. ఈ ఏడాదిలో తిరిగి వారు ఎలాంటి గుడుంబా తయారీ, విక్రయాలకు పాల్పడిన వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలిస్తున్నారు. ఎల్లారెడ్డిపేట ఎక్సైజ్‌శాఖ పరిధిలో బైండోవర్లు చేసిన 512 మందిలో నేరాలకు పాల్పడ్డ 43 మందిని అరెస్ట్ చేశారు. బైండోవర్‌ల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రూ.లక్ష జరిమానా చెల్లించడం లేదంటే జైలుకు వెళ్లడం జరిగింది. బైండోవర్లను ఆషామాషిగా తీసుకోవద్దని అధికారులు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

ఆగని దందా..

జిల్లాలో ఇలాంటి కఠినమైన శిక్షలు అమలు చేస్తున్నప్పటికీ నాటు సారా తయారీ, విక్రయాలకు బ్రేక్ పడడం లేదు. ఓ వైపు లక్షల్లో జరిమానాలు చెల్లిస్తున్నా.. జైలుశిక్షలు పడుతున్న గుడుంబా తయారికీ పూర్తిస్థాయిలో దూరం కావడం లేదు. జిల్లాలోని కేవలం ఎల్లారెడ్డిపేట సర్కిల్‌లోనే 512 మందిని బైండోవర్లు చేసినప్పటికీ మళ్లీ తిరిగి సారాయి బాటనే పడుతున్నారు. ఇప్పుడు మాత్రం ఎలాంటి ఉపేక్ష లేకుండా ప్రభుత్వం బైండోవర్లు అయిన వ్యక్తుల నుంచి రూ.లక్ష వసూలు లేదంటే జైలుకు పంపుతున్నారు. ఓ వైపు ఇలాంటి కఠినమైన శిక్షలు పడుతుంటే మరోవైపు నేరాలకు పాల్పడుతున్నారు. గతేడాది బైండోవర్ చేసిన ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్, వెంకటాపూర్ గ్రామాలకు చెందిన భూక్య కళ, జాగిరి ఎల్లయ్యలు గుడుంబా అమ్ముతూ పట్టుపడగా వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గత మంగళవారం ఇద్దరి నుంచి రూ.లక్ష చొప్పున జరిమానా చెల్లించారు. జరిమానా రూపంలో వచ్చిన సొమ్మును అధికారులు ప్రభుత్వ ఖజానాలో జమచేశారు. ఇలా బైండోవర్లు చేసిన వ్యక్తులు తిరిగి నేరాలు చేస్తూ డబ్బులు చెల్లిస్తున్నారు. గుడుంబా అమ్మితే జరిగే పరిణామాలు, శిక్షలు, జరిమానాల చెల్లింపులు, జైలుశిక్షలపై పోలీసు, ఎక్సైజ్‌శాఖల అధికారులు గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

బైండోవర్లను ఆషామాషీగా తీసుకోవద్దు



గుడుంబా, గంజాయి నేరాల్లో చేసే బైండోవర్లను ఎవరూ ఆషామాషీగా తీసుకోవద్దు. నాటుసారా లేని సమాజం కోసం ప్రభుత్వం కఠిన శిక్షలు అమలు చేస్తోంది. బైండోవర్ చేసిన వ్యక్తులపై ఎప్పుడూ నిఘా ఉంటుంది. వారు తిరిగి నేరాలకు పాల్పడితే షరతుల ప్రకారం రూ.లక్ష జరిమానా లేదంటే, జైలుశిక్ష అనుభవించాల్సిందే. ఇందులో ఎవరికి మినహాయింపు ఉండదు. ప్రభుత్వ నిషేధిత గుడుంబా, గంజాయి లాంటి వాటికి ప్రజలు దూరంగా ఉండాలి. – ఎంపీఆర్ చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ, ఎల్లారెడ్డిపేట

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రొసీడింగ్ కాపీలతో మహిళలు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ లేని రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు అన్నారు. మండలంలోని హరిదాస్‌నగర్‌లో గురువారం 25 సంఘాలకు వడ్డీలేని రుణాల ప్రొసీడింగ్స్ కాపీలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం మహిళలు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చిరంజీవి, సర్పంచ్ అమృత, కార్యదర్శి సంపత్, ఎంపీటీసీ మల్లేశం, వీవోఏ అక్షిత, వీవో అధ్యక్షురాలు జల్లి పద్మ, నాయకులు సిరికొండ నాగరాజు, శేఖర్, జనార్దన్, మహిళలు పాల్గొన్నారు.

పెరటి తోటల పెంపకంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

సిరిసిల్ల అర్బన్ : సిరిసిల్ల పట్టణం బీవైనగర్‌లోని సఖి క్లస్టర్ ఆధ్వర్యంలో పెరటితోట పెంపకంపై బల్యాలనగర్‌లోని మహిళలకు గురువారం అవగాహన కల్పించారు. చిరుధాన్యాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి మహిళలకు వివరించారు. కార్యక్రమంలో సఖి క్లస్టర్ వింధ్యారాణి, శారద, లలిత, సుజాత, పద్మలత, పద్మాదేవి, అరుణ, జ్యోతి, సునీత, తదితరులున్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి

- వాటర్‌ప్లాంట్‌ను వినియోగంలోకి తేవాలి
- గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్లఅర్బన్: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. నిత్యావసరాల స్టాక్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని నిర్వాహకులను మందలించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధి పెద్దూరులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను గురువారం కలెక్టర్ అనురాగ్ జయంతి తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరుశాతాన్ని పరిశీలించారు. 427 మందికి 361 మంది విద్యార్థులు ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. వంట గదిని పరిశీలించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. నిత్యావసరాల స్టాక్ రిజిస్టర్ పరిశీలించి, అప్‌డేట్ లేకపోవడంతో నిర్వాహకులను మందలించారు. వాటర్‌ప్లాంట్‌కు మరమ్మతులు చేసి, వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. మిషన్ భగీరథ నీటి కనెక్షన్ ఇవ్వాలని, మరుగుదొడ్లను పరిశీలించి నల్లాలకు మరమ్మతు చేయాలని సూచించారు. తరగతిగదుల్లో బోధన తీరును పరిశీలించి, విద్యార్థులకు బెడ్స్, ఫ్యాన్స్ ఏర్పాటు చేయాలన్నారు. శాశ్వత భవన నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందో వివరాలు అందజేయాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు.

పోలీసులు జవాబుదారీగా పనిచేయాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్



మొక్క నాటుతున్న జిల్లా ఎస్పీ

చందుర్తి(వేములవాడ): పోలీసులు ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. చందుర్తి సర్కిల్ కార్యాలయంతోపాటు చందుర్తి పోలీస్‌స్టేషన్‌ను గురువారం తనిఖీ చేశారు. సీఐ కార్యాలయం ఎదుట మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 5ఎస్ ఇంప్లిమెంటేషన్, ఫంక్షనల్ వర్టికల్స్ పనితీరు, సిబ్బంది నామినల్ రోల్స్, హెచ్‌ఆర్‌ఎంఎస్, స్టేషన్ రికార్డులను పరిశీలించారు. స్టేషన్‌లో ఫైళ్లను సక్రమమైన పద్ధతిలో ఉంచాలన్నారు. ఠాణాలో ఉన్న వాహనాల ఆర్సీ పేపర్లను తీసుకొచ్చి వాహనాలకు తీసుకెళ్లాలని యజమానులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఫిర్యాదులను వెంటనే స్పందించాలని సూచించారు. వాహనాల తనిఖీ, డ్రంకెన్‌డ్రైవ్‌లు చేపట్టాలన్నారు. సీఐ కిరణ్‌కుమార్, ఎస్సై రమేశ్ ఉన్నారు.

ఐక్యతతో పండుగలు నిర్వహించాలి

సిరిసిల్లక్రైం: కులమతాలకతీతంగా ప్రజలందరూ ఐక్యంగా పండుగలు చేసుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ కోరారు. రంజాన్‌ను పురస్కరించుకొని సిరిసిల్లటౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో గురువారం వివిధ మతపెద్దల సమక్షంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా పండుగలను జరుపుకోవాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే విద్వేష పూరిత పుకార్లను నమ్మవద్దని కోరారు. సిరిసిల్ల డీఎస్పీ విశ్వప్రసాద్, తహసీల్దార్ విజయ్‌కుమార్, ట్రాఫిక్ ఎస్సై రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపర్చాలి

- జిల్లా విద్యాధికారి రమేశ్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో

సిరిసిల్ల ఎడ్యుకేషన్: జిల్లా విద్యా సమాచారాన్ని ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా పొందుపర్చాలని జిల్లా విద్యాధికారి రమేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గీతానగర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యా సంవత్సరం లాగే ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల, ఉపాధ్యాయ, పాఠశాల వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపర్చేందుకు అధికారులకు ఆదేశాలు చేశామన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూడైస్ ప్లస్‌పై పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలలోని వసతులను పరిశీలించారు. ఎస్ఎస్ఏ సెక్టోరల్ ఆఫీసర్ పద్మజ, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ బిల్లులను చెల్లించాలని శుక్రవారం జిల్లాకేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో నిరసన తెలుపనున్నట్లు సంఘం నాయకులు గురువారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఏర్పాటు సమావేశంలో నాయకులు మాట్లాడారు. పెండింగ్ బిల్లులను ఈ నెలాఖరులోగా విడుదల చేయాలన్నారు. స్వరాష్ట్రంలో వేతనాల కోసం ఉద్యమించాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు పెద్దసంఖ్యలో హాజరై నిరసన తెలపాలన్నారు. కార్యక్రమంలో యూఎస్‌పీసీ నాయకులు పాకాల శంకర్ గౌడ్, దోర్నాల భూపాల్ రెడ్డి, అవురం సుధాకర్ రెడ్డి, మహేందర్ రావు, మల్లారపు పురుషోత్తం, సత్తు రవీందర్, పరకాల రవీందర్, తడుక సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



కలెక్టరేట్‌లో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్

సిరిసిల్ల: గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బందికి అవగాహన ఉండాలని జిల్లా ఉపవైద్యాధికారి రజిత కోరారు. కలెక్టరేట్‌లో గురువారం సుందరయ్యనగర్, తంగళ్లపల్లి ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి కార్డియో పల్మనరీ రిసిటేషన్(సీపీఆర్)పై శిక్షణ ఇచ్చారు. డాక్టర్ రజిత మాట్లాడుతూ గుండెపోటు వచ్చినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలన్నారు. ఇటీవలి కాలంలో గుండెపోటుతో మరణాలు సంభవిస్తున్నాయని, ఆ జాగ్రత్తలు తెలియక ప్రాణాలు పోతున్నాయన్నారు. విలువైన ప్రాణాలను కాపాడడమే సీపీఆర్ లక్ష్యమన్నారు. శిక్షణలో డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ వేణుమాధవ్, డీఈఎంవో బాలయ్య, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నేడు జాతీయ సాహిత్య సదస్సు

సిరిసిల్లకల్చరల్: రాష్ట్ర భాష, సాంస్కృతికశాఖ, మానేరు రచయితల సంఘం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సంయుక్త నిర్వహణలో కళాశాలలో శుక్రవారం జాతీయస్థాయి సాహిత్య సదస్సు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్ తెలిపారు. ఇందులో కళాశాల పూర్వ విద్యార్థి, కేంద్ర సాహిత్య అకాడమీ బాలసాహిత్య పురస్కార గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ సాహిత్యంపై సమాలోచన చేయనున్నట్లు తెలిపారు. కవులు, సాహితీవేత్తలు భారీగా హాజరై సదస్సును జయప్రదం చేయాలని కోరారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్యా యత్నం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కేసీఆర్‌కాలనీలో నివసించే ఓ వివాహిత కుటుంబ కలహాలతో గురువారం పురుగుల మందు తాగింది. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్ తరలించారు. కేసీఆర్‌కాలనీలో నివసించే భారతం జ్యోతి(32)కి భర్త వెంకటేశ్‌తో కొంతకాలంగా విబేధాలు ఉన్నాయి. ఆర్థికంగా సమస్యలు, భార్యతో తరచూ గొడవలు పడుతుండగా మనస్థాపానికి గురైన జ్యోతి గురువారం పురుగులమందు తాగింది. ప్రస్తుతం కరీంనగర్ ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య చికిత్స పొందుతోంది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సుదర్శన చండీ చక్రయాగం



ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారు ఓమౌజాయ ప్రజ్ఞ క్షేత్రంలో గురువారం శ్రీసుదర్శన చండీ చక్రయాగం నిర్వహించారు. సద్గురు సత్యభగవాన్ ప్రభుజీ ఆధ్వర్యంలో సుదర్శన యజ్ఞం నిర్వహించారు. ఈనెల 22 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు చండీయాగంతో ముగిశాయి. యజ్ఞానికి కరీంనగర్, నిర్మల్, కామారెడ్డి, గద్వాల్, వరంగల్, కర్నూల్ జిల్లాల నుంచి సుమారు 3 వేలకు పైగా భక్తులు తరలివచ్చారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషిచేయాలి

- యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్రీధర్



మాట్లాడుతున్న శ్రీధర్

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయుల కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గోల్కొండ శ్రీధర్ అన్నారు. జిల్లాకేంద్రంలో గురువారం జరిగిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం విద్యారంగానికి బడ్జెట్ కేటాయింపు తగ్గిస్తూ ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకుండా నాణ్యమైన విద్యను పేదలకు దూరం చేస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా కార్పొరేటీకరణకు బాటలు వేస్తుందని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ప్రజలకు వివరించి ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాకాల శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా గుండమనేని మహేందర్ రావు, ఉపాధ్యక్షులుగా అంబటి రమేశ్, కోశాధికారి పర్కాల రవీందర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ వంగ మల్లేశం, జిల్లా కార్యదర్శులు అడేపు శివకుమార్, పాముల స్వామిగౌడ్, కొత్వాల్ ప్రవీణ్ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు

- రూ.94.98 లక్షలతో 31 పనులు
- శుద్ధ జలం.. స్నానాలకు వేడి నీరు
- మంత్రి కేటీఆర్ చొరవతో వసతులు చేరువ



విద్యార్థినుల దరిచేరిన శుద్ధ జలం

సిరిసిల్ల: జిల్లాలోని గురుకుల విద్యాలయాలు, కేజీబీవీ, మోడల్‌స్కూల్స్, ఏకలవ్య గురుకులం, గిరిజన ఆశ్రమ పాఠశాలలు, నర్సింగ్ కాలేజీల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. డిస్ట్రిక్ట్ మినరల్ ఫౌండేషన్ ట్రస్టు(డీఎంఎఫ్‌టీ) నిధులు రూ.94.98 లక్షలతో 31 విద్యాలయాల్లో శుద్ధనీటి(ఫిల్టర్ వాటర్) వసతి, స్నానాలకు వేడి నీళ్ల సౌకర్యం కల్పించారు. గురుకులాల్లో, హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య ఆధారంగా మిషన్ భగీరథ నీటి సరఫరా, కొత్త మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు, ఇది వరకే ఉన్న మినరల్ వాటర్‌ప్లాంట్లకు రిపేర్లు, సెప్టిక్ ట్యాంక్ ఔట్‌లెట్, టాయిలెట్ బ్లాక్‌లలో మరమ్మతు పనులు గుర్తించి చేపట్టారు. రాష్ట్ర మంత్రి, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు ఆదేశాలతో కలెక్టర్ అనురాగ్ జయంతి ఈ పనులు మంజూరు చేశారు. రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ(టీఎస్‌ఈడబ్ల్యూఐడీసీ) కార్యనిర్వాహక ఇంజినీర్ ఈ పనులను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే 16 పనులు పూర్తి చేశారు. మరో 15 పనులు ప్రగతిలో ఉన్నాయి. కలెక్టర్ అనురాగ్ జయంతి జిల్లాలో పనుల ప్రగతిని సమీక్షిస్తూ.. వేగంగా పనులు చేయిస్తున్నారు.

యాదగిరిగుట్టకు బస్సు నడపాలి

- ఎండీ సజ్జనార్‌కు మాజీ ఎంపీటీసీ వినతి



సజ్జనార్‌కు వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్ యాదవ్

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): సిరిసిల్ల డిపో నుంచి ఎల్లారెడ్డిపేట మీదుగా యాదగిరిగుట్ట, హైదరాబాద్‌కు బస్సును నడిపించాలని గురువారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్ వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో ఎండీ సజ్జనార్‌ను కలిసి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎల్లారెడ్డిపేట నుంచి మాచారెడ్డి, కామారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు, మరో బస్సును ఎల్లారెడ్డిపేట నుంచి ముస్తాబాద్, సిద్దిపేట మీదుగా యాదగిరిగుట్టకు బస్సులు నడపాలను కోరారు. ప్రతి ఆదివారం కొమురవెల్లి దేవస్థానానికి నడిపించాలన్నారు. అందుకు ఎండీ సజ్జనార్ సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు. రూటు సర్వేకు అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

సైబర్ నేరగాళ్ల వలలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని

- రూ.1,53,140 కోల్పోయిన వైనం

సిరిసిల్లక్రైం: సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని సైబర్‌నేరగాళ్ల వలలో చిక్కి రూ.1.53 లక్షలు మోసపోయింది. పోలీసులు తెలిపిన వివరాలు. సిరిసిల్ల పట్టణంలోని వెంకట్రావునగర్‌కు చెందిన గురిపెల్లి ఆకాంక్ష సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. మరింత ఆదాయం పొందాలని ఇంటర్‌నెట్‌లో ఓ వెబ్‌సైట్‌ను తెరిచింది. దానిలో తన సమాచారాన్ని అప్‌లోడ్ చేయగా.. వెబ్ నిర్వాహకులు ఆకాంక్షకు రూ.100 రివార్డుగా అందించారు. తాము అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ పెట్టుబడి పెడితే అధికంగా రివార్డు ఇస్తామని నమ్మబలికారు. నమ్మిన ఆకాంక్ష కొంత.. కొంత సొమ్మును పెట్టుబడిగా పెడుతూ ఏకంగా రూ.1,53,140 పెట్టింది. రివార్డు రాకపోవడంతో వెబ్‌సైట్‌లో సమాచారం కోసం వెతికింది. ఇంతలోనే సంబంధిత వెబ్‌సైట్ అదృశ్యమైంది. మోసపోయానని తెలుసుకున్న ఆకాంక్ష సిరిసిల్లటౌన్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసినట్లు సీఐ అనిల్‌కుమార్ తెలిపారు.

ప్రజలంతా కాంగ్రెస్ వెంటే..

వేములవాడ : దేశ ప్రజలంతా కాంగ్రెస్ పార్టీ వెంటే ఉన్నారని డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. గుజరాత్ ఎన్నికల సమయంలో మోడీపై చేసిన వ్యాఖ్యలపై రాహుల్‌గాంధీకి రెండేళ్ల జైలుశిక్ష అమలు చేయాలని తీర్పునివ్వడంపై కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన గాంధీ విగ్రహం ఎదుట మౌనదీక్ష చేశారు. కార్యక్రమంలో నాయకులు సాగారం వెంకటస్వామి, పిల్లి కనుకయ్య, సంగ స్వామి, సత్యలక్ష్మి, భారతి, విష్ణు, రాకేశ్, రాజు, కరుణాకర్, పాషా, మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE
LAND FOR SALE
■ ప్రతి నెల 40 వేల ఆదాయం. సంగారెడ్డి, నారాయణఖేడ్ దగ్గర 80 ఎకరాల మెగా ఫామ్‌ల్యాండ్ వెంచర్ ఎకరం: 32 లక్షలు. ఉగాది ఆఫర్ ఎకరం 23,50,000/- మాత్రమే. ఫోన్ : 8143944827 [HA-1059]

SERVICES
■ అతి తక్కువ వడ్డీతో ఇల్లు, వ్యక్తిగత, టేక్ ఓవర్, మార్టిగేజ్ లోన్స్ కలవు. CIBIL స్కోర్ తక్కువ ఉన్న ఫైనాన్స్ ఇవ్వబడును. ఏజెంట్లు కావలెను. ✆ 8699691739. [T-1792]

BUSINESS OFFER
■ Capro కంపెనీ ప్రైవేట్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్. ✆ 9319814720. [T-1196145]

www.sakshi.com

WANTED
■ మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190652]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824